


**కార్పొరేట్ల కోసమే ప్రజలపై భారం మోపుతున్న మోదీ: ఎమ్మెల్సీ సత్యం**

ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

మంగళవారం | 07 ఏప్రిల్ , 2026 | పేజీలు : 06



### వినూత్న ఆలోచనలతో ముందుకు రండి

# పారిశ్రామికవేత్తలుగా మారండి

**జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపు**

**ఏప్రిల్ 11న నల్లగొండ ఐటి టవర్స్‌లో ఇన్నోవేషన్ పంచాయత్**

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** యువత వినూత్న ఆలోచనలతో ముందుకు వచ్చి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు.ఈనెల 11న నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఐటీ టవర్స్‌లో తెలంగాణ ఇన్నోవేషన్స్ ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ పంచాయత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు,అంకురాలను ప్రోత్సహించే లక్ష్యంతో తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.నల్లగొండ,సూర్యాపేట,యాదాద్రి జిల్లాల నుంచి ఆవిష్కర్తలు, ఔత్సాహిక వ్యవస్థాపకులను ప్రోత్సహించడం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. రాష్ట్ర రాజధాని వెలుపల ఉన్న ఆవిష్కర్తలకు వనరులు అందుబాటులోకి తీసుకురావడమే ఈ కార్యక్రమం లక్ష్యమని,ఆసక్తి ఉన్న యువత క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి నమోదు చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్,డీఎఫ్ఓ రాజశేఖర్,ఆర్‌డిఓలు రమణా రెడ్డి,శ్రీదేవి,ఈడియం దుర్గారావు, టీజీఐసీ కోఆర్డినేటర్లు అనూష,ఫరీన తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల లోపాలపై ఏనుగు కవితా స్వరం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఎన్నికల వ్యవస్థలోని లోపాలను పద్యరూపంలో ప్రతిబింబిస్తూ సమాజంలో చైతన్యం కలిగించే ప్రయత్నంగా నిర్వహించిన పద్య గానం కార్యక్రమం ఆద్యంతం ఆకట్టుకుంది.తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి జన్మదినం సందర్భంగా ఆయన రచించిన ఏడుకోలల బాయి ఎన్నికల శతకం పై సృజన సాహితీ ఆధ్వర్యంలో స్థానిక యుటిఎఫ్ భవన్‌లో ఈ కార్యక్రమం జరిగింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన కవులు తమకు కేటాయించిన శతకం లోని పద్యాలను గానం చేసి సభను రంజింపజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ కవిత్వాన్ని జీవితంలో భాగంగా భావిస్తానని, సాంప్రదాయ పద్య రూపంలో ఆధునిక అంశమైన ఎన్నికల వ్యవస్థపై రచించడం తనకు సంతృప్తినిచ్చిందన్నారు. ఈ శతకం సమాజంలో విస్తృతంగా వ్యాప్తి చెందడం ఆనందంగా ఉందని, ఎన్నికల రంగంలో సమూల మార్పులు అవసరమని పేర్కొన్నారు. డాక్టర్ ముడుంబై పురుషోత్తమాచార్య మాట్లాడుతూ కవిత్వం ద్వారా సామాజిక సమస్యలను ప్రతిబింబించడం గొప్ప విషయమని అన్నారు. ఏడుకోలల బాయిలో ఎన్నికల స్వరూపం ప్రతిఫలిస్తోందని,ఆ స్వరూపాన్ని మార్చాలనే సంకల్పమే కవి ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమానికి పెరుమాళ్ళ ఆనంద్ అధ్యక్షత వహించగా డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య,డాక్టర్ తూర్పు మల్లారెడ్డి,డాక్టర్ కనకటి రామకృష్ణ,డాక్టర్ సాగర్ల సత్తయ్య,బండారు శంకర్,ఇడికోజు శ్రీనివాసాచారి,పెరుమాళ్ళ వెంకటేశం,నర్రా సుఖేందర్ రెడ్డి,అనిత కుమారి,బరిగెల శ్రవణ్,బైరెడ్డి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.




# వార్డుల అభివృద్ధిలో ఆ నలుగురు...



**నిత్యం ప్రజాసేవలోనే..**

**ప్రజా సమస్యల పరిషారమే పరమావధి**

**ఆపదలో ఆపన్నహస్తం**

**కార్యకర్తలకు తోడు నీడగా**

**పార్టీలకతీతంగా అక్కున చేర్చుకునే నైజం**

**ఇవే రెండవసారి కౌన్సిలర్స్‌గా వారి గెలుపు మంత్రాలు**

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** వార్డుల సమూల అభివృద్ధి సంక్షేమ ఫలాలను లబ్ధిదారులకు అందించడం ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించడం ఏ ఆపద వచ్చినా మేమున్నామనే పూర్తి భరోసానిచ్చి ప్రజల ఆశీర్వాదంతో రెండవసారి గెలిచిన పోచంపల్లి ఆ నలుగురు కౌన్సిలర్ లు బాత్క లింగస్వామి యాదవ్(5వ వార్డు) కుడికాల అఖిల బలరాం(11వ) పెద్దల చక్రపాణి(4వ) దేవరాయ కుమార్(8). పోచంపల్లి మున్సిపాలిటీగా కొత్తగా ఏర్పడ్డాక ఈ నలుగురు బిఆర్ఎస్ పార్టీ నుండి కౌన్సిలర్లుగా గెలిచారు. బాత్క లింగస్వామి వైస్ చైర్మన్ గా ఎన్నికై విధులు నిర్వహించారు. ముగ్గురు మళ్ళీ అదే పార్టీ అవే వార్డుల నుండి గెలిచి సత్తా చాటారు.ఒక్క దేవరాయ కుమార్ మాత్రం కాంగ్రెస్ పార్టీలోకి మారి రిజర్వేషన్ ఆధారంగా 8వ వార్డు నుండి పోటీ చేసి ప్రత్యర్థులకు చిక్కకుండా విజయం సాధించారు. ప్రత్యర్థులు అతిరథ మహారథులను పోటీలోకి దింపినప్పటికీ మూడో కంటికి తెలియకుండా గెలుపు ప్రణాళికలు రచించుకుని ప్రతి వ్యూహాలతో మరీ విక్టరీ కొట్టారు. రాజకీయ అనుభవం పక్కన పెట్టి ప్రజల ఆకాంక్షల మేరకు కచ్చితత్వంతో పని







చేస్తూ బలమైన నాయకులుగా ఎదుగుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పుర పరిపాలన నిధులు అభివృద్ధి మౌలిక వసతుల కల్పన డ్రైనేజ్ సీసీ రోడ్ల నిర్మాణం నూతన గృహ నిర్మాణ అనుమతులు నల్లా కనెక్షన్స్, పెన్షన్ మంజూరు, వృద్ధాప్య పెన్షన్లు యువ సంఘం భవన నిర్మాణాలు అందించడంలో ముందువరుసలో నిలిచి ప్రజల విశ్వాసం చూరగొని మరింత దగ్గరయ్యారు. వార్డు ప్రజలకు కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా తోడుగా మేమున్నామని ఆపన్న హస్తం అందిస్తూ ఆదర్శ ప్రజా ప్రతినిధులుగా రాణిస్తున్నారు. నిత్యం ప్రజల్లోనే ఉంటూ ఇల్లిల్లు తిరుగుతూ జనాలు ఎదుర్కొంటున్న సమస్యలను నోట్ బుక్ లో నమోదు చేసుకుంటూ వాటి పరిష్కారాలకై నిత్యం కృషి చేస్తున్నారు. అనారోగ్యంతో బాధపడే బాధితులకు మృతుల కుటుంబాలకు ఆర్థిక సహాయం చేస్తూ కుటుంబ సభ్యుల వలే మానవత్వం చాటుకుంటున్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహా యం మాజీ ఎమ్మెల్యే పళ్ళ శేఖర్ రెడ్డి నాయకత్వంలో పనిచేసి అత్యంత సన్నిహితంగా మెలిగి సమస్యల కోసం పోరాడే వ్యక్తులుగా నిధులను మంజూరు చేయించి అభివృద్ధికి బాసటగా నిలుస్తూ వస్తున్నారు. అదే స్ఫూర్తితో ఆయన మార్గదర్శకత్వంలో నిజమైన ప్రజా ప్రతినిధులు ప్రజల కోసం నిజాయితీగా అనుక్షణం ఎలా పనిచేస్తారో నిరూపిస్తున్నారు. ఈ నలుగురు కౌన్సిలర్స్.



## డ్రైనేజీపై మ్యాన్ హోల్

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్** : 22వ వార్డు పరిధి లోని నల్లగొండ చౌరస్తా, కటకం గోవర్ధన్ సార్ ఇంటి వద్ద డ్రైనేజి పై మ్యాన్ హోల్ పెట్టకపోవడం వల్ల ప్రమాదకరంగా ఉందని పిల్లలు ఆడుకుంటూ అందులో పడే ప్రమాదం ఉందని స్థానికులు కౌన్సిలర్ జాలిగం విఘ్నేష్ దృష్టికి తీసుకురాగానే వెంటనే స్పందించి సొంత నిధులతో మ్యాన్ హోల్ చేయించి దానిని మూసివేశారు. కౌన్సిలర్ స్పందించిన తీరుపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందించారు. ఈ కార్యక్రమంలో జాలిగం శివ, సళ్ళ యాదగిరి, ఇటుకల మహేందర్, భూషపాక సంతోష్, దినేష్ పాల్గొన్నారు.

## నిరుద్యోగ మైనార్టీ యువతకు విదేశీ ఉపాధి

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఆర్థిక సంస్థ, శిక్షణ, ఉపాధి ప్లేస్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ మైనార్టీ యువత విదేశాలలో ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూర్యాపేట జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి టి. నర్సింహులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆస్ట్రేలియా, ఓమాన్, జర్మనీ, కతార్ దోహా, గ్రీస్ లాంటి దేశాలలో వివిధ ఉద్యోగాల నందు ఉపాధి అవకాశాలు ఉన్నట్లు తెలిపారు. అర్హత గల మైనార్టీ అభ్యర్థులు తమ యొక్క విద్యార్హత, ధృవీకరణ పత్రాలతో జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ, సూర్యాపేట కార్యాలయం నందు ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పనివేళలలోపు సంప్రదించాలన్నారు. సూర్యాపేట జిల్లాలోని మైనార్టీ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## లక్ష్మమ్మకు నివాళులు

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం** : సిపిఐ యం సీనియర్ నాయకుడు మాజీ సర్పంచ్ దోనూరి రత్నా రెడ్డి సతీమణి దోనూరి లక్ష్మమ్మ మృతి చెందారు. ఆమె పార్థివ దేహం పై సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చ నగోని గాలయ్య, సిపిఐ జిల్లా సమితి సభ్యుడు చిలివేరు అంజయ్యలు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ నాయకులు మాట్లాడుతూ ఆమె సరళ స్వభావం గల సేవ భావంతో అందరి మన్ననలు పొందిన మహిళగా నిలిచారని అన్నారు. వామపక్ష భావాజాల నిబద్ధతకు మారుపేరుగా నిలిచారని మాట్లాడారు. ఆమె మృతి వామపక్ష పార్టీలకు తీరని లోటని లక్ష్మమ్మ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యుడు కలకొండ సంజీవ, ఈద మల్లయ్య పాల్గొన్నారు.



## సిరి మెటల్ ప్రొడక్ట్స్‌ను రద్దు చేయాలంటూ రైతుల ధర్నా



**ప్రజాపక్షం/రామన్నపేట** : చట్టపరమైన అనుమతులు లేకుండా, చట్ట విరుద్ధంగా ఏర్పాటుచేసిన యాదాద్రి భువనగిరి జిల్లా రామన్నపేట మండలం సిరిపురం గ్రామంలోని సిరి మెటల్ ప్రొడకట్స్ పేరుతో ఏర్పాటు చేసిన కంకర క్రషర్‌ను వెంటనే రద్దుచేసి వందలాదిమంది రైతాంగాన్ని ఆదుకోవాలని ప్రజా పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు నూనె వెంకట్ స్వామి మరియు అఖిలపక్షాల నాయకులైన బిజెపి నాయకులు ఏళ్ల సంజీవరెడ్డి, సిపిఎం నాయకులు బడుగు రమేష్, బిఆర్ఎస్ నాయకులు పున్న వెంకటేశం, పిఆర్‌పిఎస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వరికల్ గోపాల్, విలేజ్ డెవలప్మెంట్ ఫోరం అధ్యక్షులు కిషోర్, బాధిత రైతు నాయకులు కందుల మల్లారెడ్డి తదితరులు రైతు ముట్టడిలో పాల్గొని మాట్లాడుతూ కోరారు. సోమవారం అఖిలపక్షాల ఆధ్వర్యంలో రామన్నపేట తహసిల్దార్ కార్యాలయం ముందు సిరిపురం గ్రామంలో సిరి మెటల్ ప్రొడకట్స్ వల్ల వచ్చే దుమ్ము, ధూళి పంట పొలాలకు నష్టం కలుగుతున్నందున బాధిత రైతులతో కలిసి అన్ని రాజకీయ పార్టీలు, అన్ని రైతు సంఘాలు కలిసి ధర్నా నిర్వహించాయి. ఈ ధర్నాలో ప్రజా పోరాట సమితి జిల్లా నాయకులు గాదే ఎల్లేష్,గ్రామ ఉపసర్పంచ్ మూడుదుడ్ల అనూష రమేష్,బిజెపి గ్రామ అధ్యక్షులు సత్యనారాయణ,సిపిఎం నాయకులు బల్గూరి అంజయ్య,రైతు బాధితులు దయ్యాల మల్లయ్య, దయ్యాల శ్రీశైలం, బల్గూరి నరసింహ,సంగిశెట్టి మహేష్, బల్గురు వెంకటేశం,కూనూరు యాదగిరి గౌడ్,బీసుల బీరయ్య, నరసింహ పాల్గొన్నారు.

## విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉపాధ్యాయులు విద్యా కమిటీలు కృషి చేయాలని పోచంపల్లి మున్సిపాలిటీ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో జరిగిన బడిబాట కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన బాధ్యత అందరి మీద ఉందని అన్నారు. అధునాతన సౌకర్యాలతో పాటు శిక్షణ అనుభవం ఉన్న ఉపాధ్యాయులతో విద్యాబోధన జరుగుతుంది. కాబట్టి తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలోని చేర్పించాలని కోరారు. ఇదే పాఠశాలకు చెందిన శ్రీసహశ్రీ నేషనల్ మెరిట్ స్కాలర్షిప్‌కు ఎంపికైన మండలంలోని ఏకైక విద్యార్థి అని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, వేముల భ్రమరాంబ, విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆరోగ్య సేవలు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : ప్రభుత్వ ఆరోగ్య సేవలు సద్వినియోగం చేసుకొని మంచి ఆరోగ్యం సొంతం చేసుకోవాలని మండల వైద్యాధికారిని డాక్టర్ శ్రీవాణి కోరారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా సోమవారం పోచంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, ఎయిమ్స్ బీబీనగర్ ఆధ్వర్యంలో టీబీ ముక్త్ భారత్ అభయాన్ కార్యక్రమంలో ఆరోగ్య శిబిరం జూలూరులో నిర్వహించారు.126 మంది రోగులను పరీక్షించి టిబి, అనుమానిత లక్షణాలు గల 115 మందికి ఎక్స్రే పరీక్షలు 8 మందికి తెమడ పరీక్షలు చేసినట్లు డాక్టర్ శ్రీవాణి వివరాలు తెలిపారు. గ్రామ సర్పంచ్ కాసుల అంజయ్య ఉపసర్పంచ్ దాసరి నరసింహ వార్డు మెంబర్లు ఆరోగ్య శిబిరమును ప్రారంభించిన శిబిరంలో మంచి స్పందన లభించిందని చెప్పారు. ఈ శిబిరంలో చౌటుప్పల్ డివిజన్ టిబి సూపర్వైజర్ శ్రీనివాస్ రెడ్డి, పోచంపల్లి మండల టిబి నోడల్ అధికారి ఎంఏ బేగ్ ఆరోగ్య ఉపకేంద్ర ఉద్యోగులు భవాని, సంధ్యారాణి, ఆశా కార్యకర్తలు, జూలూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సహాయం

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల పరిధి లోని సిరిపురం గ్రామానికి చెందిన మాంద్ర మల్లేష్ అనారోగ్య సమస్యలతో ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటోందన్న విషయం తెలుసుకున్న సిరిపురం జడ్పీహెచ్ఎస్ 1996/97 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు మానవతా దృక్పథంతో ముందుకొచ్చారు. స్నేహితుడి కుటుంబానికి చేయూతనివ్వాలని నిర్ణయించి సోమవారం రూ.1 లక్ష నగదు సేకరించి మల్లేష్ ఇద్దరు కుమార్తెల పేరుమీద ఫిక్స్ డిపాజిట్ చేసిన పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మొగిలి శ్రీనివాస్, సిల్వేరు ఉపేందర్, బెల్లంకొండ నగేష్, సంగిశెట్టి భాస్కర్, కంకల మల్లేష్, సంగిశెట్టి రమేష్, బెల్లంకొండ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల పరిధిలోని నీర్నేముల గ్రామంలో చలమల్ల జగన్నాథం మృతి చెందగా గ్రామ సర్పంచ్ గోపాల్ రెడ్డి పూలమాలవేసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తూ, రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా ఆవుల స్వామి భౌతికకాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆవుల శ్రీశైలం యాదవ్, మాజీ ఉపసర్పంచ్ చల్ల అనిత సత్య ప్రకాష్, నాయకులు చిరంజీవి, జితేందర్, క్రాంతికుమార్, అశోక్, గణేష్, రవి తదితరులు పాల్గొన్నారు.





## ఏప్రిల్ నెలాఖరు వరకూ సాగునీరు

**ప్రజాపక్షం/తుంగతుర్తి** : రైతాంగం పంటలు కాపాడే విధంగా ఏప్రిల్ నెలాఖరు వరకు ఎస్ఆర్ఎస్‌పి నీళ్లు విడుదల చేయాలని సోమవారం తుంగతుర్తి నియోజక వర్గ కేంద్రంలో బిఆర్ఎస్ శ్రేణులు నిరసన తెలియజేస్తూ రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య మాట్లాడుతూ యాసంగి రైతుబరోసా ఒకేసారి ఇవ్వాలని, రైతుభీమా అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండలంలో కాలువ నీళ్ళను బంద్ చేయడం వలన దాదాపు ఇరవై శాతం పంటలు నిండు పొట్ట దశలో ఎండిపోయి ప్రమాదం ఉందన్నారు. స్థానిక ఎమ్మెల్యే వెంటనే స్పందించి జిల్లా మంత్రితో మాట్లాడి నీరు విడుదల చేయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుండగాని రాములు గౌడ్, గుండగాని దుర్గయ్య, గాజుల యాదగిరి, సర్పంచ్‌లు మనోజ్, ఎల్లయ్య, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ధర్మా టీచర్స్ యూనిటీ క్యాలెండ్ ఆవిష్కరణ



**ప్రజాపక్షం/యాదాద్రి** : ధర్మా టీచర్స్ యూనిటీ క్యాలెండ్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో డీఈఓ సత్యనారాయణ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డిటియు కన్వీనర్ ఎర్ర సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ విద్యా కమిషన్ సమర్పించిన సిఫార్సులను సవరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలకు గౌరవప్రదమైన పాఠశాల విద్య కావాలని కోరుకుంటున్నారని పాఠశాలల్లో మౌలిక వసతులు లేని ఉపాధ్యాయుల కొరత ప్రభుత్వ విధానమైన చర్యలతో ప్రభుత్వ పాఠశాలల పరిస్థితులు అగమ్య గోచరంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఎర్ర సుధాకర్, సభ్యులు డప్పు బిక్షమయ్య, పి.మహేష్, చింత యాదగిరి పాల్గొన్నారు.

## సర్పంచులకు, ఉపసర్పంచ్‌లకు సన్మానం



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట నియోజకవర్గం సాధించడమే ముఖ్య ఏజెండాగా చేస్తున్న కార్యక్రమాలలో భాగంగా ప్రజాప్రతినిధులను నియోజవర్గం సాధించడంలో భాగస్వామ్యం చేయడానికి ప్రస్తుత ప్రజా ప్రతినిధులను, మాజీ ప్రజాప్రతినిధులను ప్రజలను ఏకం చేయడానికి సోమవారం ఇంద్రపాల నగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్‌కు, ఉప సర్పంచ్ నల్ల జయసుధ స్వామికి మరియు నిధాన్ పల్లి సర్పంచ్ నారపాక మాధవి యాదయ్యకి, ఉపసర్పంచ్ కొండా అండాలుకి ఇతర వార్డు సభ్యులకు సన్మానం చేశారు. సన్మాన కార్యక్రమంలో నల్ల నరేందర్, గడ్డం యాదగిరి, డాక్టర్ నకిరేకంటి అశోక్, ఎండి ఫజల్, జెట్టి శివప్రసాద్, నకిరెకంటి నరేష్, పెండెం రవీందర్, ఆవుల నరేందర్, ఎమ్.డి ఇమామ్, మీర్ ఖాజా అలీ మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

## సన్నాహక సమావేశం

**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల పరిధిలోని ఇంద్రపాలనగరం గ్రామంలో కుట్టు మిషన్ కేంద్రం వద్ద జరిగిన మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే ఐకేపీ సెంటర్‌ల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన సన్నాహక సమావేశంలో గ్రామ సర్పంచ్ గర్దాస్ విక్రమ్ పాల్గొన్నారు. వీరితో పాటు ఉపసర్పంచ్ నల్ల జయసుధ స్వామి, పంచాయతీ కార్యదర్శి రసూల్, ఆకస్మిక పర్యటనలు చేశారు. 4వ వార్డ్ లోగల బోర్ వద్ద జరుగుతున్న మరమ్మతు పనులను, నర్సరీలో కోతుల సమస్యల నుండి మొక్కల రక్షణ కోసం చర్యలు, మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్, ఇతర వార్డ్‌లలో డ్రైనేజీలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.



## రామన్నపేటను అసెంబ్లీ నియోజకవర్గంగా ప్రకటించాలి

**ప్రజాపక్షం/రామన్నపేట** : అసెంబ్లీ నియోజకవర్గాల పెంపులో భాగంగా రామన్నపేటను అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంగా ప్రకటించాలని తెలంగాణ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మాజీ కార్యదర్శి రాపోలు నరసింహా అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రామన్నపేటలో ప్రభుత్వాసుపత్రి, కోర్టు, డివిజన్ ఆఫీసులు, అన్ని రకాల ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలు ఉండి గతంలో కూడా నియోజకవర్గ కేంద్రంగా ఉన్న రామన్నపేటను ప్రస్తుతం పెంచే నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా ప్రజల అభిప్రాయాన్ని గౌరవించి నియోజకవర్గ కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రామన్నపేట మండల పార్టీ అధ్యక్షులు మీర్జా ఫజల్ బేగ్, చేనేత నాయకులు గోసిక చక్రపాణి, తెలుగుదేశంపార్టీ రామన్నపేట బి.సెల్ మండల అధ్యక్షులు పున్న వెంకటేశం, గజం నరసింహా తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను వెంటనే ప్రారంభించాలి



**ప్రజాపక్షం/రామన్నపేట** : రామన్నపేట మండల వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి గత లోపాలను సరిదిద్దుకొని రైతాంగానికి నష్టం వాటిల్లకుండా చూడాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల అధ్యక్షుడిగా బోయిని ఆనంద్, మండల కార్యదర్శిగా గన్నెబోయిన విజయ భాస్కర్, ఉపాధ్యక్షులుగా కందుల మల్లారెడ్డి, తాళ్లపల్లి జితేందర్, మండల కమిటి సభ్యులుగా కొమ్ము అంజమ్మ, కరకంటి మల్లయ్య, బోల్ల వెంకన్న, దేవరపల్లి బిక్షంరెడ్డి, దాడి మల్లారెడ్డి, సిల్వర్ రాజు, తాడూరి కిష్టయ్య, కాకులారపు కల్పన, గంగాదేవి అంజయ్య, బండ జగన్మోహన్ రెడ్డి తదితరులను ఎన్నుకున్నారు.

## రాష్ట్రస్థాయి కరాటే పోటీలో సత్తా చాటిన విద్యార్థినులు



**ప్రజాపక్షం/రామన్నపేట:** మండల పరిధిలోని ఇంద్రపాలనగరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినీలు ఆదివారం భువనగిరిలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలో పాల్గొన్నారు. వీరిలో 8వ తరగతి విద్యార్థినీలు లయ, శిరీషలు 2 గోల్డ్ మెడల్స్ సాధించగా, 9వ తరగతి విద్యార్థినీలు దేవిక, ఇందు, ప్రత్యుషలు 3 సిల్వర్ మెడల్స్ సాధించారు. 5 గురు విద్యార్థినులు బ్రాంజ్ మెడల్స్ సాధించి తమ సత్తా చాటి విజయం సాధించిన విద్యార్థినులను గ్రామసర్పంచ్ గర్దాస్ విక్రమ్ అభినందించి మెడల్స్‌ను ,ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కే.శేఖర్, ఏఏపిసి చైర్మన్ మమత, కరాటే కోచ్‌లు అప్పం చెన్నకేశ్వర్, తెల్ల ప్రసాద్ ,పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలి




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ఫీజు నియంత్రణ చట్టం అమలు చేయాలని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం నాగార్జున అన్నారు. సోమవారం పట్టణంలోని జ్యోతి రావుపూలే భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడతూ ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం నియంత్రణకు చర్యలు తీసుకుంటామని చెప్పినప్పటికీ అమలు చేయడంలో విఫలమైందన్నారు. స్కూల్ బేస్ ఫీజును ఖరారు చేయడానికి అవసరమైన డేటా సేకరణలో కూడా జాప్యం జరుగుతుందని, ఇప్పటికే ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు అధికంగా ఫీజును పెంచి యూనిఫార్మ్, పుస్తకాలు పేరుతో అదనపు భారాన్ని తల్లిదండ్రులపై మోపుతున్నాయని, ఇది సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు తీవ్రమైన ఆర్థిక భారంగా మారిందన్నారు. వేసవి సెలవుల్లో విద్యార్ధులకు ప్రత్యేక తరగతులు నిర్వహించే పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థుల నుంచి ముందస్తు అడ్మిషన్లు తీసుకున్న కళాశాలలను రద్దు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వి.భరత్, ఇమాన్యుయేల్, సందీప్, కిరణ్, మధు,రాజు, గోపి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైనేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని ధర్నా



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : సూర్యాపేట పట్టణంలో చేస్తున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, పనులలో నిర్లక్ష్యం వహిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ డివిజన్ కార్యదర్శి కొత్తపల్లి రేణుక మాట్లాడుతూ సూర్యాపేట పట్టణంలో ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను నిర్వహిస్తుండగా, ఆ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ కెఎన్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ వారు ఆరు నెలల్లో పూర్తి చేయాల్సిన పనులను నేటి వరకు పూర్తి చేయకపోవడం విచారకరమన్నారు. ఈ పనులపై స్థానిక ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి పట్టించకపోవడం సిగ్గుచేటన్నారు. పనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న సందర్భంలో పోలీసులు బ్యానర్‌ను చించి, నాయకులను అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కారింగుల వెంకన్న, ఎర్ర అఖిల్ కుమార్, పేర్ల నాగయ్య, మారసాని చంద్రకళ, రేణుక, సంతోషిమాత, జయమ్మ పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్** : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మున్సిల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది అన్నారు. సోమవారం మండలంలోని కుప్పిరెడ్డిగూడెంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులకు మద్దతు ధర అందించాలనే లక్ష్యంతో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సన్నాలు పండిస్తున్న రైతులను ప్రోత్సహించడానికి క్వింటాకు రూ.500 బోనస్ అందిస్తున్నట్లు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సిహెచ్. హన్మంతరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ యండి షఫీ ఉల్లా, యండి అంజద్‌అలీ, కోతిగోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

## గోదావరి జలాలు అందించాలని డిమాండ్

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : మూసీ విషపు నీళ్లతో ఇబ్బందులు పడుతున్న రైతులకు, వ్యవసాయ కూలీలకు, వృత్తిదారులకు గోదావరి జలాలే పరిష్కారమని అఖిల భారత రైతు సంఘం జాతీయ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి తెలిపారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా మూడవ మహాసభల సందర్భంగా పోచంపల్లి పట్టణంలోని సోమవారం జిబిఆర్ ఫంక్షన్ హాల్‌లో మూసీ ప్రక్షాళన గోదావరి జలాల సాధన అనే అంశంపై జరిగిన సదస్సుకు ఆయన ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు. మూసీ పరివాహక ప్రాంతము సస్యశ్యామలం కావాలంటే బస్వాపురం ప్రాజెక్టు ద్వారానే నీళ్లు మళ్లించాలని డిమాండ్ చేశారు మళ్లించాలని డిమాండ్ చేశారు. మూసీ వేదిక గౌరవ అధ్యక్షులు పిట్టల శ్రీశైలం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం మూలంగా మూసీ డంపింగ్ యార్డ్‌గా మారిందని ఆవేదన వెలిబుచ్చారు. మూసి నీటిని శుద్ధి చేయాలంటే తక్షణం మూసి కాల్వలో కత్వాలపై ఈటీపీలు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ సదస్సుకు మండల అధ్యక్షులు గూడూరు బుచ్చిరెడ్డి అధ్యక్షత వహించగా ఈ సదస్సులో తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మాటూరి బాలరాజు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండమడుగు నర్సింహ, రైతు సంఘం సీనియర్ నాయకులు అంజిరెడ్డి, సీనియర్ న్యాయవాది కొత్త బుచ్చిరెడ్డి, రైతు సంఘం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.





## బిటి రణధివే జీవితం స్ఫూర్తిదాయకం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** అఖిల భారత కార్మిక సంఘం వ్యవస్థాపకులు బీటీ రణధివే జీవితం కార్మిక లోకానికే కాక యువతకు కూడా స్ఫూర్తిదాయకమని సీఐటీయూ నాయకులు డబ్బికార్ మల్లేష్, మలు గౌతంరెడ్డిలు అన్నారు. సోమవారం బీటీ రణధీవే 36వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. రణధివే ఉన్నత విద్యావంతుడని, 1928లో రహస్య కాలకలపాలు కొనసాగిస్తున్న కమ్యూనిస్టుపార్టీ ఆఫ్ ఇండియాలో చేరాడన్నారు. అదే సంవత్సరం బొంబాయిలో అఖిలా భారత వృత్తి సంఘం కాంగ్రెస్‌లో పేరొందిన నాయకుడయ్యారని అన్నారు. ముంబైలోని వస్త్ర పరిశ్రమ కార్మికుల గిరిని కామ్‌గార్ సమైక్యలో, రైల్వే కార్మికుల పోరాటాల్లో క్రియాశీలకంగా కృషి చేశారని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామ్మూర్తి, వేణుధర్‌రెడ్డి, ఏఎస్.రావు, రామచంద్రు, శ్రీనివాస్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల విస్తరణ, ఇతర కారణాలతో మహనీయుల విగ్రహాలను తొలగించొద్దు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలో ట్రాఫిక్ అధికంగా ఉందని రోడ్డు విస్తరణలో భాగంగా సాగర్ రోడ్డులో గల మహనీయుల విగ్రహాలను తొలగించవద్దని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. సోమవారం ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని, అధికారులను కలిసి ఆయన వినతిపత్రం అందించి మాట్లాడారు. రోడ్ల విస్తరణ ఇతర కారణాలతో మహనీయుల విగ్రహాలను తొలగించడం అంటే వారి ఆశయాలను మనం సమాధి చేయడమే అవుతుందన్నారు. తప్పనిసరి అయితే మహనీయులు, చారిత్రక నేపథ్యం ఉన్న విగ్రహాలను ఉంచి రాజకీయ నాయకుల విగ్రహాలను తొలగించండని అన్నారు. కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు, దొనేటి శేఖర్, నక్క నాగరాజు, మహేష్, బొమ్మకంటి హరి, శ్రీనివాస్‌యాదవ్, రాంబాబు, అంజియాదవ్, సతీష్, విక్రమ్ పాల్గొన్నారు.

## యాదమ్మకు ప్రముఖుల ఘన నివాళి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి** : పోచంపల్లి మండలం కనుముకుల గ్రామంలో మాజీ జెడ్పిటిసి కోట పుష్పలత మల్లారెడ్డి తల్లి కోట యాదమ్మ దశదినకర్మకు రాష్ట్ర పాడి పరిశ్రమ శాఖ కోపరేషన్ చైర్మన్ గుత్తా అమిత్ రెడ్డి, మాజీ మంత్రి ఎలిమినేటి ఉమా మాధవ రెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్, మాజీ జెడ్పిటిసి చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, మాజీ ఎంపీపీ మాడుగుల ప్రభాకర్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పాక వెంకటేష్ యాదవ్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ భూపాల్ రెడ్డిలు హాజరయ్యి ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు పాటి సుధాకర్ రెడ్డి, పోచంపల్లి మున్సిపాలిటీ కౌన్సిలర్స్ బాత్క లింగస్వామి యాదవ్, అఖిల బలరాం, ధర్మోజి గూడెం సర్పంచ్ రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

## రేషన్ అందించాలని వినతి

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్** : మండలంలోని నాగులపహాడ్ గ్రామంలో రేషన్ కోసం పడుతున్న అవస్థలను తొలగించాలని కోరుతూ గ్రామ సర్పంచ్ నిరంజన్ రెడ్డి, నాయకులు సోములు సోమవారం తహశీల్దార్‌కు రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన స్పందిస్తూ ప్రతి నెల మూడు రోజులు గ్రామంలో రేషన్ పంపిణీ చేసేలా ఆదేశాలు జారీ చేయడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.



## ఆరోగ్యం సామాజిక బాధ్యత

**ప్రజాపక్షం/భువనగిరి** : ఆరోగ్యం అంటే కేవలం వ్యక్తి గత విషయం కాదని అది సామాజిక బాధ్యత అని భువనగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజూల వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం భువనగిరిలో ఆరోగ్య భద్రతకు సంబంధించిన ర్యాలీకి భువనగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ పోతంశెట్టి మంజూల వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. కోటి రూపాయలు ఉన్నా కూడా కొన ఊపిరిని కొనలేం అనే నినాదంతో మనము ప్రజలను మహిళలను చైతన్యం చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## అవయవ దానం అశ్వమేధ యాగంతో సమానం



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : అవయవ దానం అశ్వమేధ యాగంతో సమానమని స్పందన స్వచ్ఛంద సంస్థ గౌరవ అధ్యక్షులు గుండా రమేష్ అన్నారు. సోమవారం పట్టణానికి చెందిన విశ్రాంత జిల్లా పరిషత్ ఉప ముఖ్య కార్యనిర్వాహణాధికారి డిఎస్‌వి శర్మ తమ అవయవ దాన అంగీకార పత్రాన్ని స్పందన శరీర, అవయవ దాన సంస్థకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాల దృక్పదంతో, మానవీయ కోణంలో, పవిత్ర ఆశయంతో శరీర, అవయవ దాతగా ముందుకు రావడం సమాజానికి స్ఫూర్తి దాయకమన్నారు. ఈ కార్యక్రమంలో మిట్టకోల కోటయ్య, హెచ్. పిచ్చిరెడ్డి, రౌతు రమేష్ పాల్గొన్నారు

## ప్రజల సమస్యల చట్టపర పరిష్కారానికి తక్షణ కృషి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : ప్రజల సమస్యల చట్టపర పరిష్కారానికి అధికారులు తక్షణమే కృషి చేయాలని జిల్లా ఎస్‌పి కె. నరసింహ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా బాధితుల నుండి ఫిర్యాదులను స్వీకరించి మాట్లాడారు. ఎలాంటి సమస్యలు ఉన్నా ప్రజలు పైరవీలు లేకుండా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీసు సేవలను వినియోగించుకోవాలని సూచించారు.

## స్కూల్ ఆవరణలో సంఘ బంధం నిర్మాణాలు వద్దు

**ప్రజాపక్షం/నకిరేకల్** : మండలంలోని బండపాలెం ప్రభుత్వ పాఠశాల ఆవరణలో సంఘ బంధం కోసం ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని సిపిఎం మండల కమిటీ సభ్యుడు చౌగోని నాగయ్య డిమాండ్ చేశారు. ఇప్పటికే పాఠశాలలో సరైన ఆటస్థలం లేకపోవడంతో పాటు ప్రహరీ గోడ కూడా లేని పరిస్థితి ఉందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో స్కూల్ ప్రాంగణాన్ని మరింత ఇరుకుగా చేసే నిర్మాణాల ఆలోచన తగదన్నారు.

# ప్రజలు సురక్షిత ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : ప్రజలు ఆరోగ్యకరమైన జీవనం కోసం సురక్షిత ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పెండెం వెంకటరమణ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, ఆరోగ్య భద్రతా విభాగం సూర్యాపేట ఆధ్వర్యంలో వాక్‌థాన్ (ఆహార భద్రతా ర్యాలీ)ను పట్టణంలోని గాంధీపార్కు నందు ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. జిల్లా ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా ఆహార భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. సురక్షితమైన, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చన్నారు. ఆ సురక్షిత ఆహారం వల్ల ఫుడ్ పాయిజనింగ్, డయేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందని తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో ఆహారం త్వరగా పాడవ్వడం వల్ల జాగ్రత్తలు మరింత అవసరమని సూచించారు. ఫాస్ట్‌ఫుడ్స్, జంక్ ఫుడ్స్ తీసుకోకుండా వుండాలని, శీతల పానీయాలను తీసుకోకుండా కొబ్బరి బొండాలను తీసుకోవాలని, పాకెట్ల ద్వారా లభించే ఆహారాలు, తినుబండరాలు తినేముందు గడువు తేదిని పరిశీలించవలసినదిగా సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి బి. ప్రభాకర్, జిల్లా వెల్ఫేర్ అధికారి నర్సింహారావు, డిప్యూటి డిఎంహెచ్‌ఓ డాక్టర్ జి. చంద్రశేఖర్, అన్నం రామకృష్ణారెడ్డి, పోల నర్సింహారావు, వైద్య ఆరోగ్య సిబ్బంది, నర్సింగ్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# తనువు చాలించినా నలుగురికి చూపునిచ్చి



**ప్రజాపక్షం/నకిరేకల్:** మరణానంతరం కూడా మానవ సేవ కొనసాగాలనే సంకల్పంతో కనుకుంట్ల సుశీల సమాజానికి ఆదర్శంగా నిలిచారు. నేత్ర దానం ద్వారా నలుగురికి చూపునివ్వడంతో పాటు తన పార్థివ దేహాన్ని వైద్య విద్యార్థుల పరిశోధనలకు అందజేసి సేవాభావాన్ని చాటిచెప్పారు.సిపిఎం సీనియర్ నాయకుడు కనుకుంట్ల శంకర్‌రెడ్డి సతీమణి కనుకుంట్ల సుశీల (70) ఆదివారం సాయంత్రం గుండెపోటుతో కన్నుమూశారు.ఆమె ఆకాంక్ష మేరకు భర్త శంకర్‌రెడ్డి,కుమారులు సుధీర్‌రెడ్డి,నవీన్ రెడ్డి,విద్యాసాగర్‌రెడ్డి కలిసి పార్థివ దేహాన్ని నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి వైద్య విద్యార్థుల అధ్యయనార్థం అందజేశారు.అలాగే ఆమె నేత్రాలను లయన్స్ క్లబ్‌కు దానం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సతీమణి వేముల పుష్ప,ట్రస్ట్ చైర్మన్ ఎన్.రామ్మోహన్ రావు,డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ట్రెజరర్ అశోక్‌రెడ్డి,డీసీ ఎర్ర శంభులింగారెడ్డి,టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దైద రవీందర్,లయన్స్ క్లబ్ ప్రతినిధులు సూర్యచందర్‌రావు,అండె వెంకన్న,పైళ్ల శశిధర్‌రెడ్డి,చౌగోని శ్రీనివాస్, సిపిఎం నాయకులు బొజ్జ చిన్న వెంకులు, వెంకటేశ్వర్లు పాల్గొని నివాళులర్పించారు.

**మరణంపై నాయకుల సంతాపం** : సుశీల మృతి పట్ల ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి, పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# కన్నప్రేమ.. కడవరకూ తోడు!



**ప్రజాపక్షం/నకిరేకల్(కేతేపల్లి): నకిరేకల్:** అమ్మ ఆమె ప్రేమకు అర్థం చెప్పలేం.ఆమె లేకపోతే ఆలోటు ఎప్పటికీ నిండదు.అలాంటి తల్లిని కోల్పోయిన నలుగురు కుమార్తెల హృదయాల్లో బాధ ఎన్ని మాటలు చెప్పినా తక్కువే..కష్టకాలంలో ఆడపిల్లలు కొండంత అండగా నిలుస్తారని మరోసారి నిరూపితమైంది. సంప్రదాయాలను దాటి తామూ అమ్మ రుణం తీర్చగలమని నలుగురు కుమార్తెలు చూపించి అందరి మనసులను కదిలించారు.జిల్లా కేతేపల్లి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన రేగట్టే లింగమ్మ అనారోగ్యంతో ఆదివారం కన్నుమూశారు. ఆమెకు నలుగురు కుమార్తెలు మాత్రమే.తల్లి మృతితో వారు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.అయితే చివరి వీడ్కోలు కార్యక్రమంలో కుమార్తెలే అన్నీ తామై వ్యవహరించారు. సంప్రదాయం ప్రకారం పురుషులు మాత్రమే పాడె మోయాల్సి ఉన్నప్పటికీ,తల్లిపై ప్రేమతో ముగ్గురు కుమార్తెలు స్వయంగా పాడెను భుజానికెత్తుకుని శ్మశానవాటిక వరకు మోశారు.అంత్యక్రియల్లో ముఖ్యమైన తలకొరివి కార్యక్రమాన్ని చిన్న కుమార్తె ఇందిరమ్మ నిర్వహించి మగ సంతానం లేని లోటును భర్తీ చేశారు.సంప్రదాయాలను పక్కన పెట్టి మానవత్వాన్ని చాటిన కుమార్తెల ధైర్యసాహసాలను గ్రామస్తులు ప్రశంసించారు.ఆడపిల్లలైనా అమ్మకు కొడుకులై నిలిచారు అంటూ స్థానికులు అభినందించారు.

## అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** అంగన్‌వాడీ కేంద్రాలను బాలింతలు, గర్భిణీలు వినియోగించుకోవాలని నేరేడుచర్ల మున్సిపల్ వైస్ చైర్మన్, 6వ వార్డు కౌన్సిలర్ నూకల సందీప్‌రెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటిలోని 6వ వార్డులో అంగన్‌వాడీ కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి కమిటిసమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు, గర్భిణీలకు పౌష్టికాహారం, బాలమృతం,గుడ్లు వంటిని ప్రభుత్వం సరఫరా చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ సరిత, ఆరోగ్యలక్ష్మి కమిటి సభ్యులు ఆయా, గర్భిణీలు బాలింతలు, విద్యార్థులు, మాజీ కౌన్సిలర్ నాగయ్య పాల్గొన్నారు.



## గ్యాస్ కొరతతో ఉపాధి కోల్పోతున్న తోపుడుబండ్ల వ్యాపారులు

**ప్రజాపక్షం/నలగొండ టౌన్** : గ్యాస్ కొరతతో జీవనోపాధి కోల్పోయి సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న తోపుడుబండ్ల వ్యాపారులకు న్యాయం చేయాలని అసంఘం అధ్యక్షుడు బొడ్డుపల్లి ధనుంజయ డిమాండ్ చేశారు.పెట్టి వండర్స్ యూనియన్ తోపుడుబండ్ల వ్యాపారుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా ఇడ్లీ, దోశ,ఫాస్ట్ ఫుడ్,గప్పుప్ వంటి తినుబండారాలను విక్రయిస్తూ జీవనోపాధి సాగిస్తున్నామని తెలిపారు. గతంలో నూనెపై ఆధారపడిన తమ వ్యాపారం ఇప్పుడు కమర్షియల్ గ్యాస్ పై ఆధారపడి ఉందని చెప్పారు.అయితే ఇటీవల గ్యాస్ సిలిండర్లు అందుబాటులో లేకపోవడంతో తమ జీవనోపాధి దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వం నెలకు కనీసం 6 సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు అందజేయాలని కలెక్టర్ ని కోరారు. ఈకార్యక్రమంలో అసంఘం ఉపాధ్యక్షుడు వెంకటయ్య,ప్రధాన కార్యదర్శి భరత్ కుమార్ కోశాధికారి దామర శ్రీను,ఇతర సభ్యులు పాల్గొన్నారు.

## ఎన్ఎస్ఎస్ వేసవి శిబిరం ముగింపు



**ప్రజాపక్షం/నలగొండ(నార్కట్‌పల్లి):** విద్యార్థులు సమాజంలోని సమస్యలను తొలగించేందుకు ముందుండాలని,గ్రామాల్లో ఉన్న మూఢనమ్మకాలను తొలగించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించాలని జాతీయ సేవా పథకం సమన్వయకర్త మారం వెంకటరమణా రెడ్డి సూచించారు.మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో నిర్వహించిన ఏడు రోజుల ఎన్ఎస్ఎస్ ప్రత్యేక వేసవి శిబిరం సోమవారం విజయవంతంగా ముగిసింది. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ సోషల్ సైన్సెస్,జాతీయ సేవా పథకం యూనిట్1ఆధ్వర్యంలో ఈశిబిరం జరిగింది.ఈ కార్యక్రమానికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ ప్రియ అధ్యక్షత వహించారు. ఈకార్యక్రమంలో హిస్టరీ టూరిజం విభాగానికి చెందిన సీనియర్ ప్రొఫసర్ విజయబాబు,ఎల్లారెడ్డి గూడెం సర్పంచ్ లింగస్వామి,వార్డు సభ్యుడు వాసుదేవ్,ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ మహమ్మద్ షరీఫ్,డాక్టర్ మాతరి ఆనంద్,తదితర అధ్యాపకులు డాక్టర్ శ్రావణ్ కుమార్,డాక్టర్ ఒగ్గు సైదులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్వర్ణభారతి ట్రస్ట్ సేవలు అభినందనీయం

**ప్రజాపక్షం/కోదాడ** : సమాజంలోని పేదల కోసం కోదాడ పట్టణ స్వర్ణభారతి ట్రస్ట్ వారు అందిస్తున్న సేవలు అభినందనీయమని కోదాడ మున్సిపల్ చైర్‌పర్సన్ ఏర్నేని కుసుమావెంకటరత్నంబాబు, డిఎస్‌పి శ్రీనివాసరెడ్డిలు అన్నారు. సోమవారం పట్టణ పరిధి బాలాజీనగర్ ప్రాథమిక ఉన్నత పాఠశాల ప్రాంగణంలో హైద్రాబాద్ యశోద హస్పిటల్స్ వారి సౌజన్యంతో ట్రస్ట్ వారు ఏర్పాటు చేసిన మోగా ఉచిత వైద్యశిభిరాన్ని వారు ప్రారంభించి మాట్లాడారు. ఈ శిభిరంలో నాలుగు వేల రుపాయాల విలువైన పరీక్షలను సుమారు 400 మంది వినియోగించుకున్నట్లు నిర్వహాకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మాలోత్ చైతన్యనాయక్, 8వ వార్డు కౌన్సిలర్ రామిశెట్టి ఉదయశ్రీహరిప్రసాద్, ట్రస్ట్ చైర్మన్ నీలా సత్యనారాయణ, చారుగండ్ల ప్రవీణ, సైదానాయక్, జగిని ప్రసాద్, కాలంగి వెంకటేశ్వర్లు, బుజ్జయ్, వెంపటి ప్రసాద్, బండారు శ్రీనివాసరావు, సాయి పాల్గొన్నారు.



## మహిళా సంఘం నాయకురాలు విజయ మృతి

ప్రజాపక్షం/నడిగూడెం: మండలంలోని రత్నవరం గ్రామానికి చెందిన సిపిఐ(ఎం) కార్యదర్శి కన్నేబోయిన సైదయ్య భార్య ఐద్వా నాయకురాలు విజయ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం ఉదయం పది గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం సిపిఎం నాయకులు ఆమె మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె మృతి పట్ల సిపిఎంనాయకులు, ప్రజా సంఘాల నాయకులు బెల్లంకొండ సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, కిషోర్, శ్రీనివాసరావు, ఆంజనేయులు, హనుమయ్య, వంశి , సుధాకర్‌రెడ్డి, సీతరామిరెడ్డి, శేఖర్, కృష్ణలు పాల్గొన్నారు.

## ఐదు నెలల గర్భిణికి కరెంట్ షాక్



ప్రజాపక్షం/అర్వపల్లి : మండలంలోని సూర్యనాయక్ తండకు చెందిన నికిత ఇంట్లో ఉన్నటువంటి మోటర్ స్విచ్ఆన్ చేయబోయి విద్యుత్ ఘాతానికి గురైంది. కుటుంబీకులు వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో వెంటనే అంబులెన్స్‌లో తీసుకొని ఆక్సిజన్ ఐవి ఫ్లూయిడ్స్ ప్రథమ చికిత్స అందిస్తూ ఏరియా హాస్పటల్‌కి తరలించడంతో పెనుప్రమాదం తప్పింది.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం



ప్రజాపక్షం/మాడుగులపల్లి : రబీలో రైతులు పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు ఏర్పాటు చేసిన పిఏసిఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,చెరువుపల్లి సర్పంచ్ వద్దే సైదిరెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చెరువుపల్లి, ఇందుగుల గ్రామాలలో పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబి మాజీ డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, మానిటరింగ్ అధికారి రజిత,సీఈఓ బిక్షమయ్య, గ్రామ పరిపాలన అధికారి ప్రశాంత్,హరికృష్ణ,ఇటికాల నాగిరెడ్డి వెంకన్న పాల్గొన్నారు.

## ఆర్థిక సహాయం

ప్రజాపక్షం/రామన్నపేట : రామన్నపేట పట్టణ కేంద్రానికి చెందిన సల్ల చిన్న రామచంద్రం అనారోగ్యంతో మరణించగా ఆయన మృతదేహానికి మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గరిక సత్యనారాయణ పూలమాలవేసి నివాళులర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతూ రూ.5000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు మొహమ్మద్ జమీరుద్దీన్, ఉప సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రజాపక్షం/మాడుగులపల్లి: రబీ సీజన్‌లో రైతులు పండించిన వరి ధాన్యానికి ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందేందుకు ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి ఎర్రబెల్లి శేఖర్ రెడ్డి సూచించారు.సోమవారం మండల పరిధిలోని గారకుంటపాలెం,గుర్రప్పగూడెం గ్రామాల్లో ఇందిరా క్రాంతి పథకం (ఐకేపీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు.అలాగే ఆగామోత్కూర్,చిరుమర్తి,పాములపాడు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను తహసీల్దార్ సరోజ పావని, ఏపీఎం మధుసూదన్,స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ రబీ సీజన్‌లో జిల్లాలో మొత్తం 401 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకున్నామని,కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు 124 రైస్ మిల్లులను అనుసంధానం చేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరోజ పావని, ఏపీఎం మధుసూదన్,మండల సమైఖ్య అధ్యక్షురాలు కొండ సావిత్రమ్మ,సర్పంచ్‌లు పెద్ది కృపాకర్,పందిరి మారయ్య,అండం రేణుక యాదయ్య, కూరెళ్ల నాగమణి వెంకటాచారి,కునుకుంట్ల అంజయ్య పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమానికి 10 మంచాలు..వీధి వ్యాపారులకు గొడుగులు




ప్రజాపక్షం/నకిరేకల్: గూడపూరి వెంకటేశ్వరరావు సహకారంతో నకిరేకల్ లయన్స్ క్లబ్,నవ్య క్లబ్ ఆధ్వర్యంలో తాటికల్ వృద్ధాశ్రమానికి రూ.25 వేల విలువైన 10 మంచాలను బహూకరించారు.ఫాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్‌రావు,ఫాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ వై.మోహన్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నకిరేకల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం,లయన్స్ క్లబ్‌లు చేపడుతున్న సేవా కార్యక్రమాలు ఆదర్శనీయమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వీధి వ్యాపారులకు గొడుగులను పంపిణీ చేశారు.జోన్ చైర్మన్ బుడిగె శ్రీనివాసులు,ట్రస్ట్ చైర్మన్ ఎన్.రామ్మోహన్‌రావు, కార్యదర్శి ఎల్లపురెడ్డి యాదగిరిరెడ్డి,కోశాధికారి కందాల నారాయణరెడ్డి, క్లబ్ అధ్యక్షుడు రేపాల సతీష్,నవ్య క్లబ్ అధ్యక్షురాలు ఎన్.రమాదేవి, డిస్ట్రిక్ట్ చైర్మన్‌లు ఎర్రశంభులింగారెడ్డి,డి.సూర్యకుమార్,బాణాల రామ్ రెడ్డి,కోటగిరి రమేష్,దేవరశెట్టి పెద్ద శ్రీనివాసులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కి వినతి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : పట్టణంలో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణానికి వివిధ గ్రామాలలోని చెరువుల నుండి అక్రమంగా నూట నలభై కోట్ల రూపాయల మట్టిని తరలిస్తున్న కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని బిజెపి ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్కు వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో నూతనంగా కేంద్ర ప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న బైపాస్ రోడ్డు నిర్మాణంలో అడుగడుగునా అవకతవకలు,నాసిరకం పనులతో రోడ్డు నిర్మిస్తున్నారని ఆరోపించారు.అత్యంత నాసిరకంగా ఎన్‌హెచ్ నిబంధనలను పాతరేస్తూ పనులు సాగుతోన్న అధికారులు పట్టించుకోవడంలేదని రోడ్డు నిర్మాణంలో ఎక్కడా ఎర్రమట్టి కనిపించలేదని,చెరువుల నుండి వదులు మట్టి తెచ్చి రోడ్డు నిర్మించడంతో ప్రమాణాలకు తిలోదకాలు ఇచ్చి నాసిరకంతో నిర్మించడంతో ఎక్కువ కాలం ఉండక రోడ్డు మీద ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి ఉంటుందన్నారు. ఇంత జరుగుతున్న ఇరిగేషన్,మైనింగ్, రెవెన్యూ, పోలీస్ యంత్రాంగం ఏమాత్రం పట్టించుకోవడం లేదని వెంటనే కాంట్రాక్టర్ పై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను కోరారు.ఈకార్యక్రమంలో బిజెపి నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు

ప్రజాపక్షం/మాడుగులపల్లి : మండల కేంద్రంలోని పిఏసిఎస్ కొనుగోలు కేంద్రాన్ని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ సోమవారం తనిఖీ చేశారు. ఆయన కేంద్రంలోని ధాన్యం రిజిస్టర్‌లను పరిశీలించి, మాయిశ్చర్ వచ్చిన ధాన్యాన్ని వెంటనే కాంటాలు పెట్టాలని సూచించారు. అదేసంగా, అకాల వర్షాలు పడి రైతులు ఇబ్బందులు పడకుండా ధాన్యాలపై పట్టాలు ఉంచే విధానం అమలు చేయాలని చెప్పారు.రైతులు పండించిన పంటను దళారులను నమ్మి మోసపోకూడదని కూడా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరోజ్ పావని, ఆర్ఐలు శ్యామ్,సత్యనారాయణ,సర్పంచ్ ఆరూరి నరేష్,సీఈఓ రవీందర్ రావు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## పుత్ర కామేష్టి యాగం

ప్రజాపక్షం/తుర్కపల్లి : తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం, రామాలయంలో సోమవారం పుత్ర కామేష్టి యాగాన్ని నిర్వహించారు. శ్రీ పాండురంగ ఆశ్రమం వేద బ్రాహ్మణులు అప్పల సత్యనారాయణ శర్మ, కూచి వంశీ కృష్ణ శర్మ వైదిక బృందం ఆధ్వర్యంలో పుత్ర కామేష్టి యాగాన్ని నిర్వహించారు. సంతానం లేని వారికి ఈ యాగం వలన ఫలితం ఉంటుందని తెలిపారు. అప్పాల గోపాల శర్మ, సత్యం పంతులు, దంపతులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## బడుగు సైదులుకు పితృవియోగం

ప్రజాపక్షం/చౌటుప్పల్ : మండల కేంద్రంలో తెలంగాణ బీసీ గురుకులాల ఉద్యోగ సంఘం కార్యదర్శి బడుగు సైదులు తండ్రి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ సైదులు నివాసానికి చేరుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లె శేఖర్ రెడ్డి, సీపీఐ మున్సిపల్ కార్యదర్శి పగిళ్ల మోహన్ రెడ్డి, మున్సిపల్ సహాయ కార్యదర్శి ఉడత రామలింగం, కొండూరు విప్లవ్, బద్దుల సుధాకర్, టంగుటూరి రాములు, దాసరి మనోహర్, ప్రజా సంఘాల నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## మహనీయుల ఉత్సవాలను విజయవంతం చేయండి



ప్రజాపక్షం/భువనగిరి : మహనీయుల ఉత్సవాలను విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని జగదేవ్‌పూర్ చౌరస్తాలో గల మహాత్మ జ్యోతిబాపూలే విగ్రహం చుట్టూ ఏర్పాటు చేస్తున్న స్టీల్ గ్రిల్స్ పనులను భువనగిరి పురపాలక సంఘం చైర్‌పర్సన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, స్థానిక వార్డు కౌన్సిలర్ లయిక్ అహ్మద్, బీసీ సంఘాల ప్రతినిధులు కొత్త నరసింహస్వామి, కొత్త బాలరాజ్, మాటూరి అశోక్, సబర్మార్ వెంకటేష్, పూస శ్రీనివాస్ పాల్గొన్నారు.

## గ్రామాల్లో బడిబాట కార్యక్రమాలు



ప్రజాపక్షం/తుర్కపల్లి : తుర్కపల్లి మండలంలోని ఇంద్రనగర్ గ్రామంలో ఎంపీపీఎస్ పాఠశాల ఆధ్వర్యంలో ఇంద్రనగర్ గ్రామ సర్పంచ్ లక్ష్మి రామచంద్రంతో కలిసి, గంధమల్ల సర్పంచ్ బొత్త రాములు బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఐదవ తరగతి విద్యార్థులను గంధమల్ల జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు పంపించాలని, ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులకు బంగారు భవితకు బాటలు వేస్తాయని, బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. పిల్లల కోసం కాలినడకన కాకుండా ఆటో సదుపాయాన్ని కల్పిస్తామని బొత్త రాములు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్కు సుజాత, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## మెగా హెల్త్ క్యాంపు



ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం సీతారాంపురం గ్రామంలో సోమవారం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 కార్యక్రమంలో భాగంగా మెగా హెల్త్ క్యాంపును మండల వైద్యాధికారి డా. ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ మెగా హెల్త్ క్యాంపులో భాగంగా బిపి, షుగర్, రక్త పరీక్షలు, కంటి పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరం అయిన వారికి ఉచితంగా మందులను అందజేశారు. సుమారు 70 మందికి పైగా ఉచితంగా చికిత్సను అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# ఘనంగా బిజెపి ఆవిర్భావ దినోత్సవం



**ప్రజాపక్షం/భువనగిరి :** ప్రపంచంలో అతిపెద్ద శక్తివంతమైన రాజకీయ పార్టీ ఏదైనా ఉందంటే అది ఒక భారతీయ జనతా పార్టీ మాత్రమే అని బీజేపీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్ తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా భువనగిరి పట్టణంలో బిజెపి నాయకులు, కార్యకర్తలు జెండా ఎగరవేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే భారతీయ జనతా పార్టీ కార్యాలయం వద్ద యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మాయ దశరథ, మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్, పోతంశెట్టి రవీందర్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/రామన్నపేట :** రామన్నపేట మండల కేంద్రంలో బిజెపి పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జెండావిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు మదూరి ప్రభాకర్ రావు, కట్కూరి బిక్షపతి, కొమ్ము యాదయ్య, కూనూరు సుధాకర్, ఏలూరు రవి, యాదాసు లక్ష్మణ్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** భారతీయ జనతా పార్టీ (బిజెపి) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సూర్యాపేట పట్టణ కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కర్నాటి కిషన్, ఎండి అబీద్, సలిగంటి వీరేందర్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రంలో సోమవారం బిజెపి ఆవిర్భావ దినోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా చౌరస్తాలో మండల శాఖ ఆధ్వర్యంలో భాజపా జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం భాజపా నల్గొండ మాజీ పార్లమెంట్ సభ్యులు నక్క వెంకటేష్ యాదవ్ మాట్లాడుతూ ఇద్దరితో ప్రారంభమైన భాజపా దేశంలో అతిపెద్ద పార్టీగా అవతరించిందన్నారు. భాజపా నాయకులు కేతావత్ లాలునాయక్, భూతరాజు భరత్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నకిరేకల్:** పట్టణ కేంద్రంలో బీజేపీఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు.పట్టణ అధ్యక్షుడు గర్రె మురళీమోహన్ ఆధ్వర్యంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సి మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి చిన్నిని జానీ,పట్టణ మాజీ అధ్యక్షుడు పల్స శీను గౌడ్,సీనియర్ నాయకులు జిల్లా డాకయ్య పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/చందంపేట;** నల్గొండ జిల్లా చందంపేట మండలంలో సోమవారం భాజాపా 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బిజెపి మండల అధ్యక్షులు గుంటోజు వినోదాచారి బిజెపి జెండాను ఆవిష్కరించారు.



**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** భారతీయ జనతా పార్టీ 46వ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు గజరాజు కాశీనాథ్ పార్టీ జెండా ఆవిష్కరించారు. ఆమండలంలోని పల్లెర్ల కూరెళ్ళ, తుక్కాపురం పారుపల్లి, కొరటి



కల్, టి రేపాక, మోదుబాయిగూడెం, ఖప్రాయపల్లి గ్రామాలలో భూత్ అధ్యక్షులు జెండా ఆవిష్కరణ చేశారు.

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** భారతీయ జనతా పార్టీ దేశ సమగ్ర అభివృద్ధి, సుస్థిర పరిపాలన,పేదల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్న ఏకైక జాతీయ పార్టీ బీజేపీ అని, ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలు, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేసి, గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని బీజేపీ మండల పార్టీ అధ్యక్షులు మేకల శ్రీనివాస్ యాదవ్ పిలుపునిచ్చారు. తుర్కపల్లి మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద భారతీయ జనతా పార్టీ జెండాను ఆవిష్కరించి, ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

**ప్రజాపక్షం/చండూరు:** భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవాన్ని సోమవారం చండూరు బిజెపి శ్రేణులు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా చండూరు పట్టణంలో బిజెపి జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భూతరాజు శ్రీహరి, అన్నెపర్తి యాదగిరి, ఆంజనేయులు పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/డిండి;** డిండి మండల కేంద్రంలో సోమవారం భాజపా ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల కేంద్రంలో అంగడి బజార్ చౌరస్తా వద్ద బిజెపి జెండాను బిజెపి మండల అధ్యక్షుడు సింకార్ సైదాజీ ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో బిజెపి దేవరకొండ నియోజకవర్గ కన్వీనర్ ఏటి కృష్ణ, మాజీ ఎంపిటిసి రాధిక, కందుకూరు సర్పంచ్ కొండల్, జిల్లా కౌన్సిల్ సభ్యులు అంజి, రమేష్, వెంకటయ్య పాల్గొన్నారు.





## నేటి నుంచి డిగ్రీ పరీక్షలు ప్రారంభం

**ప్రజాపక్షం/నలగొండ(నార్కట్‌పల్లి):** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం పరిధిలోని డిగ్రీ పరీక్షలు నేటి నుంచి ప్రారంభమవుతున్నట్లు పరీక్షల నియంత్రణ అధికారులు తెలిపారు.ఈ పరీక్షలకు రెండో సెమిస్టర్‌కు చెందిన 8,500 మంది, నాల్గో సెమిస్టర్‌కు చెందిన 6,110 మంది,ఆరో సెమిస్టర్‌కు చెందిన5,601 మంది విద్యార్థులు హాజరవుతున్నారు.రెగ్యులర్‌తో పాటు బ్యాక్‌లాగ్ విద్యార్థులు కూడా ఈ పరీక్షలకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు.పరీక్షలు ఈ నెల 7వ తేదీ నుంచి మే నెల మొదటి వారం వరకు నిర్వహించబడతాయి. రోజుకు రెండు షిఫ్ట్‌లలో పరీక్షలు జరుగుతాయి. ఉదయం 10:00 నుంచి మధ్యాహ్నం 1:00 వరకు 2వ, 4వ, 6వ సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ విద్యార్థులకు, మధ్యాహ్నం 2:00 నుంచి సాయంత్రం 5:00 వరకు 1వ, 3వ, 5వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించబడతాయి. విశ్వవిద్యాలయం పరిధిలో మొత్తం 29 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయబడ్డాయి.ఇందులో నలగొండ జిల్లాలో 11 కేంద్రాలు,యాదాద్రి భువనగిరి జిల్లాలో 9 కేంద్రాలు, సూర్యపేట జిల్లాలో 9 కేంద్రాలు ఉన్నాయని అధికారులు తెలిపారు.

## రేషన్ బియ్యం లారీని ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/మర్రిగూడ:** ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం సరఫరాలో పారదర్శకత ఉండేలా అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు.ఈ నేపథ్యంలో మర్రిగూడలో పౌరసరఫరాల గిడ్డంగి నుంచి తరలిస్తున్న రేషన్ బియ్యం లారీని సోమవారం ఇన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ మాచన రఘునందన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.తనిఖీ సందర్భంగా లారీకి సంబంధించిన రికార్డులను పరిశీలించిన ఆయన, బియ్యం రవాణా ప్రక్రియలో ఎలాంటి అవకతవకలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే వాహనంలో అమర్చిన జీపీఎస్ సాంకేతికతను కూడా పరిశీలిస్తూ, సరఫరా మార్గం, గమ్యస్థానం తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. రేషన్ బియ్యం అక్రమ రవాణా,మళ్లింపు వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.డ్రైవర్లు సంబంధిత సిబ్బంది నియమ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/చండూరు:** మండల పరిధిలోని కస్తాల గ్రామంలో సోమవారం వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దోటి నారాయణ ప్రారంభించారు. ఎఫ్ఎస్‌సిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దొడ్డురకం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రమాకాంత్ శర్మ , వైస్ చైర్మన్ పోలు వెంకట్‌రెడ్డి , సర్పంచ్ లేదన్న సత్యనారాయణ పాల్గొన్నారు.

## సిపిఆర్‌పై విద్యార్థులకు అవగాహన

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం టిజిఎంఎస్ హెల్త్ కేర్ వోకేషనల్ కోర్సు విద్యార్థులకు మండల వైద్యాధికారి డా. ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో సిపిఆర్(కార్డిమో పల్మనరీ రిసర్సిటేషన్) , ఏఈడి (ఆటోమేటెడ్ ఎక్సటర్నల్ డిఫిబ్రిలేటర్) ట్రైనింగ్ నిర్వహించారు. 108 సిబ్బంది యాకస్వామి 108 వాహనంలో అందుబాటులో ఉండే ఏడిఆర్ మెషిన్ గురించి వివరించారు. ఈకార్యక్రమంలో సర్పంచులు దేవరబోయిన అయిలయ్య, అల్లంశెట్టి మహేష్, ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలి

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు ఎంఎల్ఏ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్యకు మంతి పదవి ఇవ్వాలని తెలంగాణ ఉద్యమ కారుడు, పిఏసిఎస్ మాజీ డైరెక్టర్ సింగారపు ఉప్పలయ్య సోమవారం రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి నల్గొండ జిల్లాలోనే ఏకైక బిసి నాయకుడు బీర్ల అయిలయ్య అని, ఎల్లప్పుడు ప్రజల మధ్యే ఉంటూ, ప్రజా శ్రేయస్సుకై పాటు పడుతూ, బీర్ల ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి నియోజకవర్గ ప్రజలకు ప్రతి నిత్యం ఏటువంటి ఆపద ఉన్న ముందుండి సహాయ సహకారాలను అందిస్తున్న ఎంఎల్ఏ బీర్ల అయిలయ్యకు మంత్రి పదవిని ఇస్తే మరిన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పేద, బడుగు, బలహీన వర్గాలకు అందించేందుకు కృషి చేయడం జరుగుతుందని అని అన్నారు. జరగబోయే క్యాబినెట్ విస్తరణలో ఆలేరు నియోజకవర్గ ఎంఎల్ఏ బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రభుత్వ భూమిని కాపాడాలి

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం వంగాల గ్రామ శివారులోని సర్వే నెం. 30లో సుమారు 6 ఎకరాలలో బండ విస్తరించి ఉన్నది. గత కొన్ని రోజులుగా కొంత మంది కుల వృత్తికోసం బండను తొలగించే కార్యక్రమం మొదలు పెట్టడంతో ఎంతో మంది రైతులకు ఉపయోగపడే బండను తొలగిస్తుండడంతో వంగాల గ్రామానికి చెందిన గాయం వేణుగోపాల్‌రెడ్డి ప్రజా వాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారులు స్పందించిన రెవెన్యూ అధికారులను ఆదేశించడంతో సోమవారం బండ ఉన్న ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం సర్వే నిర్వహించి బండ ఉన్న ప్రాంతం ప్రభుత్వ భూమి అని నిర్ధారణ కావడంతో బండను తొలగిస్తున్న వారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. మండల రెవెన్యూ అధికారి, ఆర్ఐ, సర్వేయర్, ఏపిఓ పాల్గొన్నారు.

